'పది' ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఈవో రాము

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని పాలనాధికారి రిజ్వాన్‌బాషా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధన, జాతీయ సాధన సర్వే(నాస్)లో జిల్లాకు మంచి ర్యాంకు వచ్చేందుకు గాను జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులతో డీఈవో రాము అధ్యక్షతన 'విజయోస్తు' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు 'విజయోస్తు' కార్యక్రమానికి రూపకల్పన చేశామని, ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించి నవంబరు ఒకటో తేదీ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. డిసెంబరు నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు. డిసెంబరు 10వ తేదీ వరకు మోటివేషన్ తరగతులు జరిపించాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డిసెంబరు 4న దేశవ్యాప్తంగా 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు ఏకకాలంలో నిర్వహించే నాస్ పరీక్షలో అందరూ పాల్గొని, ప్రతిభ చూపేవిధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్జీఈ కె.రవికుమార్, డీసీఈబీ కార్యదర్శి చంద్రభాను, ప్రణాళిక సమన్వయకర్త టి.రాజు, ఏఎంవో శ్రీనివాస్, జీసీడీవో గౌసియాబేగం, డీసీఈబీ సహాయ కార్యదర్శి మెరుగు రామరాజు, అన్ని మండలాల ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం వెల్లువ.. ధరల పతనం!



మార్కెట్లో ధాన్యం క్రయ, విక్రయాల సందడి

జనగామ, న్యూస్‌టుడే: ఈ నెల మొదటి తేదీ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల కొత్త మద్దతు ధరలు అమల్లోకి వచ్చాయి. దీనికి అనుగుణంగా నిర్వహణ ఖర్చులు గట్రా పోగా రైతులకు మద్దతు ధరకు అటు ఇటుగా ధరలు లభించాలి. కానీ జనగామ వ్యవసాయ మార్కెట్లో కొత్త మద్దతు ధరలకు ముందు ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో లభించిన ధరల కంటె తక్కువ ధర పలుకుతోంది. ప్రత్యేక వాతావరణ పరిస్థితుల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు వేచి ఉండలేని పరిస్థితి. వరి చేన్లలో నీరు నిలిచి కోత ఖర్చులు పెరిగి ఇబ్బంది పడుతున్న రైతులు చైన్ మిషన్లపై ఆధారపడాల్సి వస్తోంది. సాధారణ మిషన్లతో పోలిస్తే చైన్ మిషన్లకు రూ.1000 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారస్తులకు విక్రయించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఈ నెలలో ధరల పతనం రూ.లలో
3వ తేదీన 2121, 4-2091, 5, 7న-2016, 8-1971, 9-1961, 14-1976, 15-1979, 16-1986, 18న-రూ.1956, 19న-1911. 22న 1936.

ఆగస్టు 21 నుంచి సీజన్ ప్రారంభం..

జనగామ ప్రాంతంలో మూడో పంట(కత్తెర, ఎడగారు) వరి సాగు జరుగుతుంది. ఈ పంట ఆగస్టు మూడో వారం నుంచి సెప్టెంబరు మూడో వారం వరకు చేతికొస్తుంది. స్థానిక వ్యవసాయ విపణిలో 30 వేల క్వింటాళ్ల మేర క్రయ, విక్రయాలు జరిగాయి. అప్పుడు మద్దతు ధర క్వింటాలుకు రూ.2203 ఉంది. ఆగస్టులో అత్యధికంగా రూ.1919, తక్కువలో తక్కువ రూ.1859 పలికింది. సెప్టెంబరులో అత్యధికంగా రూ.2121, అతి తక్కువ రూ.1851, మధ్యస్థంగా రూ.1939 వరకు లభించింది. ఈ మాసంలో బుధవారం వరకు 23 రోజుల్లో 13 రోజులే అమ్మకాలు, ఖరీదు జరిగింది.

● అక్టోబర్ 1వ తేదీ నుంచి ధాన్యం మద్దతు ధర క్వింటాకు ఏ గ్రేడ్ రూ.2320గా ఉంది. 22వ తేది నుంచి 206 మంది రైతులు 13249 బస్తాల ధాన్యం విక్రయించారు. ఇందులో అత్యధిక ధర రూ.1946 ఒక్కరికి, రూ.1936 ముగ్గురికి, రూ.1926 పదిహేడు మందికి లభించింది. అత్యధిక రెండో ధర కేవలం 300 బస్తాలకే ఇవ్వడం గమనార్హం.

'ఈనాడు' కథనంతో..

'పోటెత్తిన ధాన్యం.. కొనుగోళ్లలో జాప్యం' శీర్షికన బుధవారం ఈనాడులో ప్రచురితమైన కథనంతో క్వింటాలుకు రూ.20 చొప్పున ధర పెంచారు. అయితే ఈ ధర పదిమందికి కూడా దక్కలేదు. ఒకవైపు పెంచినట్లే పెంచి సగటు ధరను, కనీస ధరను తగ్గించి మాయ చేశారు. 50 మంది వ్యాపారస్తులకు ఖరీదు లైసెన్సు ఉంది. మార్కెట్ పరిధిలో 20 మంది మిల్లర్లున్నారు. కొనుగోలుకు ఐదుగురు ఎగుమతిదారులు, ముగ్గురు మిల్లర్లు మాత్రమే వస్తున్నారు. దీంతో పోటీ కొరవడి, ఇష్టానుసారంగా ఖరీదు జరుగుతుంది.

ధరల తరుగుదల విషయమై వ్యాపారస్తులతో మాట్లాడామని, తాము గతంలో ఖరీదు చేసిన ధాన్యం వర్షానికి తడిసి నాణ్యత దెబ్బతిని పెట్టిన ధరలు రాలేదని, బయట టోకు ధరలు తగ్గాయని మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఖరీదుకు రాని మిల్లర్లకు నోటీసులు జారీ చేసినా స్పందించడం లేదని పేర్కొన్నారు.

దుర్గామాత తిరుగు వారం పండగ నేడు



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామలో దుర్గామాత వార్షికోత్సవాలు ముగిసి వారం రోజుల తర్వాత గురువారం(నేడు) తిరుగు వారం పండగ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కూడా దుర్గామాత ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి ఒడిబియ్యం, కానుకలు సమర్పించారు.

రూ.10 నాణెం చెల్లదనొద్దు



బిళ్లలు చెల్లుబాటవుతాయని వివరిస్తూ గోడపత్రికలను అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: రూ.10 నాణెం చెల్లదన్న అపోహ వీడాలని, తాము స్వీకరిస్తున్నామని ఇది వ్యాపారులు, ప్రజలు గమనించాలని దేవరుప్పుల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు మండల కేంద్రంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. కొంతకాలం నుంచి పది రూపాయల నాణేలు తీసుకోడానికి వ్యాపారులు, ఆర్టీసీ బస్సు కండక్టర్లు నిరాకరిస్తున్న తరుణంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రకటన మేరకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బ్యాంకు సిబ్బంది పనివేళలకు అంతరాయం కలగకుండా ఉదయం సాయంత్రం వ్యాపారులను కలిసి చెల్లుబాటవుతాయని తెలియజేస్తూ గోడప్రతులను అందజేస్తున్నారు. దేవరుప్పుల బ్యాంకు మేనేజర్ తరుణ్ సక్సేనా, సిబ్బంది విశ్వనాథ్, బాలకృష్ణ, మంజునాథ్, తుడిమిళ్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాలు నిగ్గు తేల్చేదెవరు!

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన లకావత్ శ్రీను కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తుంది. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు హుస్సేన్, గణేష్, మంగ్తి, వినోద్, మహేశ్, చిక్లిలపై కేసు నమోదు చేశారు. పాలకుర్తికి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి ప్రమేయం ఉందని ఇటీవల బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ చెప్పడం పాలకుర్తిలో చర్చనీయాంశమైంది. పోలీసుల అత్యుత్సాహం కూడా పనికిరాదని మాట్లాడటంతో ఆ శాఖాధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ శ్రీను కేసులో పరిమితికి మించి కౌన్సెలింగ్ ఇచ్చి మందలించినట్లు సమాచారం. దీంతోనే మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని బహుజన కులాల ఐక్య వేదిక నేతలు సైతం హుస్సేన్ నాయక్ ముందు వాపోయారు. ఘటనకు సంబంధించిన విషయాలు సీఐకి సైతం తెలియకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం.


నాయకుల మాటలు నమ్మొద్దు బాసు..

ప్రజలకు రక్షణ కల్పించడం, బాధితులకు న్యాయం చేయాలనే ఆశతో ఉద్యోగంలో చేరుతున్న పోలీసుల్లో కొందరు జిల్లాలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఫలితంగా పలు అపవాదలు మీదేసుకోవాల్సి వస్తుంది. ఈ క్రమంలోనే ఈ కేసులో ప్రమేయం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సై సాయిప్రసన్న కుమార్‌పై వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా తాజాగా బదిలీ వేటు వేయడం పలు చర్చలకు తావిస్తోంది.

పంచాయితీలకు కేరాఫ్‌గా..

అసలు నిందితుడిపై కేసు నమోదు కాకపోవడం, ఆయన పేరును బాధితులు, ఎస్టీ కమిషన్ సభ్యుడు సైతం పదే పదే ప్రస్తావించినా, ఆయనపై చర్యలు కరవవడంతో విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వంలోనూ ఆ నేత ఆ పార్టీ వ్యక్తి కావడంతో పలు కేసులు ఎఫ్ఐఆర్ నమోదు కాకుండా చేయడంతో వివాదాస్పదంగా మారాయి. పెద్ద మనిషిగా చెలాయిస్తూ రూ.లక్షల డిపాజిట్ రూపేణా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి వ్యవహార శైలి ఉన్న వారు స్టేషన్‌లో పెత్తనమేంటని, మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వీర్ గాథ 4.0కు స్పందన కరవు



అంతర్జాల పుట ముఖచిత్రం

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: బడిఈడు పిల్లలకు దేశభక్తి నూరిపోయడం సహా దేశం కోసం ప్రాణాలర్పించిన వారి వీరగాథలు వినిపించేందుకు కేంద్రం రూపొందించిన వీర్‌గాథ 4.0 వీక్షణానికి ప్రతిస్పందనలు తెలియచేయడంలో ప్రభుత్వ పాఠశాలలు నిరాసక్తత కనిపిస్తున్నాయి. ప్రతి స్పందనల గడువు ఈనెలాఖరు వరకు కేంద్రం పెంచింది.

కార్యక్రమ ముఖ్య ఉద్దేశం..

మన దేశ రక్షణలో వీరోచితంగా విధులు నిర్వహించిన యోధులను భారత ప్రభుత్వం గ్యాలంటరీ అవార్డుతో సత్కరిస్తుంది. వారి విజయగాథలను రూపొందించి నాలుగేళ్లుగా అంతర్జాలంలో పొందుపరిచి పాఠశాల విద్యార్థులకు ప్రదర్శనగా అందుబాటులోకి తెచ్చింది. ఈ కార్యక్రమాన్ని దృశ్యరూపంలో విద్యార్థులకు చూపిస్తే సానుకూలంగా స్పందిస్తారని కేంద్రం సూచించింది. చూసిన దానిపై తర్వాత వ్యాసం లేదా కథనం లేదా బొమ్మలు గీయడం లాంటి స్పందనలు సేకరించి తమకు పంపిస్తే మెరుగైన స్పందనలు ఎంపిక చేసి ఆ విద్యార్థులకు బహుమతిగా విమానంలో భారత రక్షణమంత్రితో సంభాషించే ఏర్పాటు చేస్తామని కేంద్రం వివరించింది. కేంద్ర ప్రభుత్వ కేంద్రీయ నవోదయ పాఠశాలలు మినహా ప్రభుత్వ పాఠశాలలు స్పందించడం లేదని సమాచారం. రెండు రోజుల క్రితం జిల్లా విద్యాశాఖాధికారులు మరోసారి గడువు పెంచుతూ ప్రతి పాఠశాల నుంచి స్పందనలు ఉండాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయి అమలులో నిర్లక్ష్యం..

కార్యక్రమ ప్రసారానికి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని హంగులున్నా, పని ఒత్తిడి సహా పలు కారణాలతో ఉపాధ్యాయులు ఒకసారి మాత్రమే ప్రదర్శన నిర్వహించారు. వీర్ గాథ 3.0లో ప్రతిభ చూపిన విద్యార్థుల అభిప్రాయాల మేరకు అవగాహన కల్పిస్తే ఆసక్తి చూపేవారు. మంచి కార్యక్రమానికి నిర్లక్ష్యం వెంటాడుతోంది.

● ఈ కార్యక్రమంలో మెరిసిన విద్యార్థులకు బహుమతిగా రూ.10వేల నగదుతో పాటు జాతీయ స్థాయిలో దేశ రాజధానికి విమానంలో రప్పించి వచ్చే గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తారు. వీర్ గాథ 3.0 వెర్షన్ విజేత హైదరాబాద్‌కు చెందిన వైష్ణవ్ ఎంపిక కావడంతో వచ్చిన గౌరవం, పరేడ్ చూడటం తన జీవితంలో అత్యంత మధురమైన ఘట్టంగా తన సంతోషాన్ని అంతర్జాల పుటలో ప్రస్తావించారు.

నీటి పొదుపుతో రేపటి భవిత



నాగిరెడ్డిపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న శుభోత్‌యాదవ్

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయ బావుల వద్ద నీటిని పొదుపుగా వాడుకోవాలని, భూగర్భ నీటి మట్టం పెరుగుదల వారికి ఎంతో దోహదం చేస్తుందని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రెటరీ ఐఏఎస్ శుభోత్‌యాదవ్, కేంద్ర భూగర్భజల బోర్డు ప్రాంతీయ సంచాలకులు కృష్ణమూర్తి అన్నారు. బుధవారం బచ్చన్నపేట మండలంలోని గంగాపూర్, నాగరెడ్డిపల్లి గ్రామాలను వారు సందర్శించి భూగర్భ జలవనరుల పెంపు, తదితర వివరాలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని గంగాపూర్, నాగిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్‌లో 2019, 2020 సంవత్సరంలో కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ నుంచి 2.50 కోట్లు వెచ్చించి చెక్‌డ్యాంలు, నీటి నిల్వ ట్యాంకులు, రీఛార్జి పిట్స్ వంటి ఎన్నో నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడుగుంత ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, క్లస్టర్ టెక్నికల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటమల్లికార్జున్, ఏపీవో కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల పోస్టుల మెరిట్ జాబితా విడుదల

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవల 13 కేటగిరీల్లో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు గాను దరఖాస్తులు స్వీకరించిన విషయం విదితమే. ఈ మేరకు బుధవారం ఆయా కేటగిరీల్లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి మెరిట్ జాబితాను బుధవారం నుంచి వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దుగ్యాల గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 28 వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు తగిన డాక్యుమెంట్లు జత చేస్తూ కళాశాల కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో అందించాలని సూచించారు.



ఊడ్చే యంత్రం.. మూణ్నాళ్ల మురిపెమేనా?

జిల్లా కేంద్రంలో కొత్త కాలనీల ఏర్పాటుతో అంతర్గత కాలనీల్లో రోజువారీ ఊడ్చే పనులు, కాల్వలను శుభ్రం చేసే పనులు జరగడం లేదు. సరిపోను కార్మికులు లేరనే సాకుతో కొన్ని వార్డులను ప్రైవేటుపరం చేశారు. 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.25 లక్షల అంచనా వ్యయంతో ట్రాక్టర్‌తో కూడిన హైడ్రాలిక్ బ్రూమర్‌ను కొన్నారు. పక్షం రోజుల క్రితం వినియోగంలోకి తెచ్చినా, నిర్వహణ భారం, ఇతర ఇబ్బందుల దృష్ట్యా పక్కన పెట్టారు. గుత్తేదారును పిలిపించి, స్థానిక పరిస్థితులకు ఇది సరిపోవడం లేదని వివరించారు. ఇతర మున్సిపాల్టీల్లో విజయవంతంగా నడుస్తున్న వాటిని పరిశీలించే పనిలో పుర అధికారులు నిమగ్నమయ్యారు. **- న్యూస్‌టుడే, జనగామ**

బాణసంచా విక్రయాలకు దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ టౌన్, న్యూస్‌టుడే: దీపావళిని పురస్కరించుకుని విక్రయించే బాణసంచా అమ్మకాల కోసం జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు, పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ సూచించారు. స్థానికంగా బుధవారం బాణసంచా విక్రయ దుకాణదారులు, రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాత్కాలిక బాణసంచా విక్రయాల కోసం దరఖాస్తు ఫారంతో పాటు అగ్నిమాపక శాఖ అధికారి ధ్రువీకరించిన ఎన్‌వోసీతో పాటు స్థల యజమాని అనుమతి పత్రాలు, ప్రభుత్వ స్థలాలు అయితే అధికారుల అనుమతి పత్రాలు ఈ నెల 23లోగా సమర్పించాలన్నారు. అనుమతి లేకుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీలు పార్థసారధి, భీమ్‌శర్మ, సీఐలు దామోదర్‌రెడ్డి, వేణు, అబ్బయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జనగామ పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 25న(శుక్రవారం) రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం హనుమకొండ రోడ్డు వైపు ఏసీపీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యధిక సంఖ్యలో యువతీ, యువకులు, స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొని రక్తదానం చేయాలని సూచించారు.

తెరమరుగు!


● ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్లలో 15 థియేటర్ల మూత

ఒక థియేటర్ నడవడం వల్ల నగరంలో 10 మంది, గ్రామీణ ప్రాంతాల్లో అయిదుగురు ఉపాధి పొందుతారు.

జిల్లాల వారీగా వివరాలు

	ప్రస్తుతం నడుస్తున్న థియేటర్లు	మూతబడినవి
త్రినగరి పరిధి	10	12
ములుగు	03	02
జనగామ	03	01

ఒకప్పుడు సినిమా విడుదల ఉందంటే థియేటర్ల వద్ద పండగ వాతావరణం ఉండేది. ప్రధానంగా దసరా, దీపావళి, సంక్రాంతి పండగల వేళ కొత్త సినిమాలతో నెలకొనే కోలాహలం అంతా ఇంతా కాదు. ఇంటిల్లిపాది సినిమా చూస్తేనే పండగకు నిండుదనం వచ్చేది. కానీ! కరోనా తర్వాత సంక్షోభంలోకి వెళ్లిన వెండితెర పూర్తిస్థాయిలో కోలుకోలేదు. వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరిలోనే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లు క్రమంగా మూతబడుతున్నాయి. గత ఐదేళ్లలో 15 థియేటర్లు మూసేశారు.



వరంగల్ నగరంలోని రామ్‌లక్ష్మణ్ టాకీస్ ఇది. పెద్ద హీరోల సినిమాలు విడుదలైనప్పుడు తెరిచి ఆ తర్వాత మూసివేస్తున్నారు



మట్టెవాడలో మూతబడిన కాకతీయ కాంప్లెక్సు

ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్‌గా..



వరంగల్ స్టేషన్‌రోడ్డులో థియేటర్ తొలగించి వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్న యాజమాన్యం

కొన్ని టాకీసులు వేడుకల మందిరంగా మారుతుండగా.. మరికొన్ని వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ప్రేక్షకులు ఇంట్లో రంగురంగుల టీవీల్లో, చరవాణుల్లో ఓటీటీల ద్వారా సినిమాలు చూస్తున్నారు. దీంతో సినిమా టాకీసులపై ఆధారపడ్డ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. అమ్మలా ఆదరించిన సినీ కళామతల్లికి ఇంతటి కష్టమొస్తుందని అనుకోలేదని థియేటర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ నగరంలో సినిమా థియేటర్ల మూసివేత, కూల్చివేతలు గత మూడేళ్లలో ఎక్కువయ్యాయి.

10 శాతం మందే ఆధారపడుతున్నారు
- రమేష్ తెలంగాణ ఎగ్జిబ్యూటర్ అసోసియేషన్ ఈసీ సభ్యుడు, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి




రోజురోజుకు భూముల విలువ పెరుగుతుండటంతో థియేటర్లు తొలగించి.. ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 10 శాతం యజమానులు మాత్రమే సినిమాలపై ఆధారపడుతున్నారు. థియేటర్ల పరిస్థితి బాగాలేదు. లాభాలు లేవు. ఇప్పుడు 90 శాతం మంది లీజుకు తీసుకొని నిర్వహిస్తున్నారు. లాభాలు లేక వారి పరిస్థితీ దయనీయంగా ఉంది. సింగిల్ థియేటర్ల మనుగడ కొనసాగాలంటే కనీసం విద్యుత్తు బిల్లులపై ప్రభుత్వం రాయితీ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

● ప్రస్తుతం నడుస్తున్న థియేటర్లు ● మూతబడినవి


- న్యూస్‌టుడే, కాశీబుగ్గ, రంగశాయిపేట

40 ఏళ్లుగా పనిచేస్తున్నా..: - మహ్మద్ దస్తగిరి, సినీ కార్మికుడు



వరంగల్ అజంజాహి మిల్లు సమీపంలో 40ఏళ్ల క్రితం వెంకట్రామా టాకీస్ కట్టారు. మొదట నెలకు రూ.240 జీతానికి టికెట్ కౌంటరులో పనిచేశా. గతంలో కొత్త సినిమా విడుదల అవుతుందంటే టాకీస్ యజమానితో పాటు మాకు ఎంతో గౌరవం ఉండేది. మూడేళ్లుగా టాకీసులు సరిగా నడవక, ప్రేక్షకులు సరిగా రాక థియేటర్ల యజమానులు నష్టపోతున్నారు. థియేటర్లకు మళ్లీ పూర్వ వైభవం రావాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం నెలకు రూ.8 వేల జీతానికి థియేటర్ కాపలాదారుగా పనిచేస్తున్నా.

రాబడి లేదు..: - గందె నవీన్, హీరో మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు కొత్త సినిమాలు విడుదల అయ్యే రోజు అభిమానులుగా మాకు పండగే. సినిమా విడుదలకు ముందు రోజు థియేటర్లను పెళ్లి మండపంలా ముస్తాబు చేసేవాళ్లం. ఇప్పుడు కొత్త సినిమాలు వస్తున్నా.. గతంలో ఉన్నంత ఆనందం కలగట్లేదు. నాడు ఒక సినిమా విడుదలైతే వంద రోజులు, సంవత్సరం పాటు నడిచేవి. ప్రస్తుతం ఒకేరోజు ఎక్కువ ఆటలు ఆడిస్తున్నారు. అయినా థియేటర్ల యాజమాన్యానికి రాబడి లేదు.



ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

● హనుమకొండకు చేరుకున్న ఎలక్ట్రికల్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే



'బస్సుల నిర్వహణ బాధ్యత జేబీఎం సంస్థకు అప్పజెప్పారు. వీటిని నడిపేందుకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన డ్రైవర్లు అవసరం ఉండటంతో ఆ సంస్థనే నియామకాలు చేపట్టనుంది. ఆర్టీసీ.. కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇవి అద్దె ప్రాతిపాదికనే నడుస్తాయి.'

ప్రజా రవాణా వ్యవస్థ అనగానే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది ఆర్టీసీ. బస్సులు నిత్యం లక్షల కిలోమీటర్లు తిరుగుతూ వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఆధునిక వసతులతో మరింత సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల ఆదరణ పొందుతోంది. ఇప్పటికే రాజధాని, గరుడ లాంటి ఏసీ బస్సులు, లహరి వంటి స్లీపర్ క్లాస్ బస్సులను ప్రవేశపెట్టింది. తాజాగా మరో అడుగు ముందుకేసి ఇంధన భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో ఎలక్ట్రికల్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది.

మూడు రకాలుగా..

- పర్యావరణ హితంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సుల్లో వరంగల్ రీజియన్‌కు 84 కేటాయించారు.
- డీలక్స్, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ మూడు రకాలు ఉంటాయి. వీటిని హైదరాబాద్ - వరంగల్, వరంగల్-కరీంనగర్ రూట్‌లో నడపనున్నారు.
- రీజియన్‌కు బుధవారం రాత్రి వరకు నాలుగు డీలక్స్, ఒకటి సూపర్ లగ్జరీ మొత్తం 5 బస్సులు చేరుకున్నాయి.
- సూపర్ లగ్జరీలో డ్రైవర్ సీటుతో కలిపి 42, డీలక్స్ బస్సుల్లో 45, ఎక్స్‌ప్రెస్‌లో 55 సీట్లు ఉంటాయి. వీటికి ఛార్జింగ్ అవసరం ఉన్నందున డిపోలో 12 ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.

మహాలక్ష్మి వర్తిస్తుంది..

ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహాలక్ష్మీ పథకం, ఇతర అన్ని రకాల రాయితీలు వర్తిస్తాయి. సాధారణ ఛార్జీలే ఉంటాయి..

ఎలక్ట్రికల్ బస్సులకు గేర్లు ఉండవు



- చొల్లేటి కిరణ్, ఆర్టీసీ సీనియర్ డ్రైవర్, వరంగల్ 2 డిపో

మామూలు ఆర్టీసీ బస్సులకు గేర్లు ఉంటాయి. ఎలక్ట్రికల్ బస్సులకు ఉండవు. ఎక్కువ స్పీడ్ వెళ్లకుండా లాక్ చేస్తారు. సీటింగ్, ఇతర మొత్తం మామూలు బస్సుల లాగే ఉంటాయి. శబ్ద కాలుష్యం ఉండదు. వైబ్రేషన్ ఉండదు. అద్దె ప్రాతిపదికన కాకుండా ఆర్టీసీ సొంతంగా ఈ బసులను నిర్వహిస్తే మరింత ఉపయోగకరంగా ఉండేది. దీంతో పాటు ఆర్టీసీ డ్రైవర్లుగా కొంత మందికి ఉపాధి దొరుకుతుంది.

ఇవీ ప్రత్యేకతలు..



- 1.45 గంటలు ఛార్జింగ్ చేస్తే 350 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తాయి.
- ప్రయాణికులకు అత్యవసరమైతే బస్సును ఆపేందుకు ప్రతి సీటుపై ఎస్‌ఓఎస్ మీట పెట్టారు.
- బస్సుకు మొత్తం 5 సీసీ కెమెరాలు అమర్చారు. డ్రైవర్ సీటు ముందు భాగంలో కెమెరా మానిటరింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశారు.
- ప్రతి సీటు వద్ద చరవాణి ఛార్జింగ్ పాయింట్ ఇచ్చారు.
- డ్రైవర్ మాట్లాడితే ప్రయాణికులకు వినపడేలా మైక్ సిస్టం ఏర్పాటు చేశారు.
- ఈ బస్సులకు ఇంటెలిజెన్స్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం అందుబాటులో ఉంది. దీని ద్వారా బస్సు ఎక్కడ ఉందో జీపీఎస్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు.
- డోర్ తెరిచి ఉంటే బస్సు స్టార్ట్ కాదు. దీనికి గేర్ సిస్టం ఉండదు. కేవలం ఎక్స్‌లెటర్ మాత్రమే ఉంటుంది. గంటకు 80 కిలోమీటర్ల వేగానికి మించి పోకుండా స్పీడ్ లాక్ చేశారు.
- జీపీఎస్‌తో అనుసంధానమై ఉండటంతో ప్రయాణికులు గమ్యం యాప్ ద్వారా ఈ బస్సు ఎక్కడ ఉంది, ఎక్కడి వరకు వచ్చింది, గమ్యస్థానం చేరుకోవడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంటే ముందుగానే పసిగట్టి అలారం మోగే విధంగా సాంకేతికతను ఉపయోగించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందేలా ఏర్పాటు చేశారు.



ఇటీవల కటాక్షపూర్ లో లెవెల్ కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద..

ఎట్టకేలకు లభించిన కటాక్షం

● వంతెన నిర్మాణానికి మార్గం సుగమం..

ఎన్నో ఏళ్ల కల.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ వంతెన నిర్మాణం.. ఎట్టకేలకు నెరవేరబోతోంది. ఈ వంతెనతోపాటు మరో చోట మూల మలుపును నేరుగా చేసేందుకు అవసరమైన భూ సేకరణ జరిపేలా బుధవారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. భూ సేకరణ పూర్తయితే వంతెన పనులను చేపట్టనున్నారు.

పరకాల, న్యూస్‌టుడే

అత్యంత కీలకం..

తెలంగాణ, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో కటాక్షపూర్ వంతెన నిర్మాణం అత్యంత కీలకం. కటాక్షపూర్ చెరువు వద్ద శిథిలావస్థకు చేరిన లో లెవెల్ కాజ్‌వేతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి పడి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు పర్యాటక ప్రదేశాలైన లక్నవరం, రామప్ప, బొగత జలపాతం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడం వల్ల అన్ని ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధ్ధృతి ఉంటే పూర్తిగా రాకపోకలు స్తంభించిపోతాయి.

భూసేకరణే ఆలస్యం..

కటాక్షపూర్ లెవెల్ కాజ్‌వే చోట వంతెన నిర్మించడానికి ఏడాదిన్నర కిందట రూ.312 కోట్లను విడుదల చేయగా టెండర్ ప్రక్రియ కూడా ముగిసింది. వంతెనను వెడల్పుగా నిర్మించడానికి హౌజ్‌బూజుర్గు, కటాక్షపూర్ గ్రామాల మధ్య కొంతమేర భూ సేకరణ అవసరం. అదే సమయంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపును నేరుగా చేయడానికి సైతం ఇరువైపులా భూమి కావాలి. ఈ రెండు చోట్ల అవసరమైన భూ సేకరణకు అనుమతి ఇవ్వాలని ఆర్ అండ్‌బీ(జాతీయ రహదారి) అధికారులు నెల రోజుల కిందట కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు బుధవారం భూ సేకరణకు కేంద్ర రహదారి, రవాణా శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ బాధ్యతలను పరకాల ఆర్డీవోకు అప్పగించారు.. భూ సేకరణకు సర్వే చేసి బాధిత రైతులకు పరిహారం ఇచ్చిన వెంటనే వంతెనతోపాటు మూలమలుపును నేరుగా చేసే పనులు ప్రారంభం కానున్నాయి.

జులై వరకు గడువు..

163వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో నుంచి ఎటూ 50 ఫీట్లతో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను హనుమకొండ, ములుగు జిల్లాలో కలిపి మొతం 36 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో హనుమకొండ జిల్లాలో 20 కిలోమీటర్లు, ములుగు జిల్లాలో 10 కిలోమీటర్ల వరకు పనులు చేయాలి. వీటికిగాను రూ.208 కోట్లను విడుదల చేయగా 2022లో పనులను చేపట్టారు. వచ్చే ఏడాది జులై వరకు ఆ పనులను పూర్తి చేయడానికి గడువు.

● దీనిపై పరకాల ఆర్డీవో కె.నారాయణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలకు ఇంకా తమకు రాలేదన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన శాతవాహన

వందేభారత్ సహా పలు రైళ్లు ఆలస్యం

డోర్నకల్, న్యూస్‌టుడే: విజయవాడ- సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ (12713) బుధవారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్ దాటాక కిలోమీటరు దూరంలో సాంకేతిక లోపంతో నిలిచింది. రైలింజన్ మీదుండే ప్యాంటో మొరాయించిందా? లేదా ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్‌లో సమస్య తలెత్తిందా అన్నది రైల్వే అధికారులే ఒక అంచనాకు రాలేకపోయారు. తర్వాత లోపాన్ని సరిదిద్ది రైలును నడిపారు. శాతవాహనకు ఉదయం 9.02 నుంచి 9.39 గంటల వరకు 37 నిమిషాలపాటు అంతరాయం కలగడంతో ఇతర రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గుండ్రాతిమడుగు దాటాక నిలిచిన ఒక గూడ్స్ రైలు మొరాయించడంతో మహబూబాబాద్ నుంచి మరో ఇంజిన్ పంపించి తీసుకొచ్చారు. ఈలోగా గుండ్రాతిమడుగు స్టేషన్‌లో విశాఖపట్నం- ముంబయి ఎల్‌టీటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్(18519) రైలు గంట, డోర్నకల్‌లో గుంటూరు- సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201) గంట 10 నిమిషాలు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్(20833) ఎక్స్‌ప్రెస్ పాపటపల్లి రైల్వేస్టేషన్‌లో గంటకు పైగా నిలిచాయి.

పట్టణాభివృద్ధికి శ్రీకారం!


● ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు

పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన విస్తరణ, అభివృద్ధి, నాణ్యమైన పట్టణవాసం కల్పించడమే లక్ష్యంగా జిల్లాకో పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- యూడీఏ)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. గతంలో ఉన్న పట్టణాభివృద్ధి సంస్థలను అవసరమైన చోట విస్తరించాలని, ఇందుకు అవకాశాలు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా 18 సంస్థలను ఏర్పాటు చేయనుంది. – జనగామ, న్యూస్‌టుడే

'ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే వరంగల్, హనుకొండ జిల్లాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి.'

'ఏజెన్సీ ప్రాంతం అత్యధికంగా ఉన్న జిల్లాలను ఈ ప్రక్రియ నుంచి మినహాయించారు. దీంతో ములుగు జిల్లాకు ఈ అవకాశం లేదు. మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి..'

యూడీఏ	వైశాల్యం (చ.కి.మీ),	జనాభా–2011	జనాభా(2024) అంచనా	పురపాలికలు /గ్రామాలు
జనగామ(జుడా)	1654.756	403516	454168	1/225
భూపాలపల్లి(బుడా)	2293	416763	462249	1/242
మహబూబాబాద్(ముడా)	1891.75	600101	654961	4/163



ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో..


జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా, జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), జిల్లా గ్రామీణ, పట్టణ ప్రణాళిక అధికారి(డీటీసీపీవో), ఆర్డీవోలు, పురపాలక కమిషనర్లు, సర్వే లాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. వీరు జిల్లా కేంద్రంతో పాటు పట్టణీకరణ ప్రభావం, విస్తరణకు అవకాశాలున్న గ్రామాలు, 2011 జనాభా, ప్రస్తుత అంచనా జనాభా, ఏరియా తదితర వివరాలతో నక్షా(ప్లాన్) తదితర వివరాలతో ప్రతిపాదనను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపించారు.

జనగామ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (జుడా)

'జనగామ మున్సిపల్ సహా 226 గ్రామాలను జుడా పరిధిలో చేర్చాలని ప్రతిపాదించారు.'

2017లో 10 మండలాలతో జనగామ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 12 మండలాలుండగా, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి. వాటిలో మార్పు లేదు. 283 గ్రామాలకు గాను.. ఈ జిల్లా సూర్యాపేట, భువనగిరి యాదాద్రి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది.

● విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్న క్రమంలో రైలు, రోడ్డు, భూముల క్రయవిక్రయాలకు అనువుగా ఉన్న కారణంతో జుడా పరిధిలోకి తేవాలని ప్రతిపాదించారు.



భూపాలపల్లి (బుడా)

'భూపాలపల్లి పురపాలిక సహా 242 గ్రామాలతో 'బుడా' ఏర్పాటుకు ప్రతిపాదించారు.'

కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని ప్రాంతాలను పునర్వ్యవస్థీకరించి భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు, రెండు రాష్ట్రాలతో సరిహద్దు బంధం కలిగి ఉంది. ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాలు, సింగరేణి, కేటీపీపీ వంటి పరిశ్రమలు, కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్రంగా ఉంది.


● ఎన్‌హెచ్ 353సి, ఎన్‌హెచ్ 163జితో అనుసంధానమై వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి అవకాశం ఉన్నందున పట్టణీకరణకు విస్తార అవకాశాలున్నందున జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ అవసరమని ప్రతిపాదించారు.



మహబూబాబాద్ (ముడా)

'మహబూబాబాద్, దోర్నకల్, తొర్రూరు, మరిపెడ(4) పురపాలికలు, 163 రెవెన్యూ గ్రామాలతో ముడాను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.'

ఎన్‌హెచ్ 365 పరిధిలోని మహబూబాబాద్ ఏడు జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది. ఎన్‌హెచ్ 563, ఎన్‌హెచ్ 930పి, ఎన్‌హెచ్ 163జిలతో అనుబంధాన్ని కలిగి ఉంది. సికింద్రాబాద్-విజయవాడ మధ్య రైలు సౌకర్యంతో ఉన్న జిల్లాలో భవిష్యత్తులో వ్యాపార, వాణిజ్య ఇతర రంగాల అభివృద్ధికి అన్ని అవకాశాలున్నందున ముడా ఏర్పాటుకు ప్రతిపాదించారు.



కొనుగోలుదారుల ఆదరణ పొందాలి



రిబ్బన్ కత్తిరించి షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నాణ్యమైన వస్త్రాలతో కొనుగోలుదారుల ఆదరణ పొందాలని వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి అన్నారు. హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను బుధవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఏ వ్యాపారానికైనా కొనుగోలుదారుల నమ్మకమే ముఖ్యమన్నారు. ప్రముఖ వస్త్ర వ్యాపారి కాసం నమఃశివాయ మొదటి కొనుగోలుదారుగా దుస్తులు కొన్నారు. షోరూం జీఎం సశింద్రన్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇదే పెద్ద షోరూం అన్నారు. దక్షిణ భారతంలో రామ్‌రాజ్ షోరూంలు అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ విజేత హనుమకొండ జట్టు



జట్టు సభ్యులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జట్టు విజేతగా నిలిచింది. హనుమకొండలోని రెడ్డిపురంలో ఉన్న టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో ఈ నెల 20 నుంచి 23 వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. ఛేదనకు దిగిన మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. విజేత హనుమకొండ, రన్నరప్‌గా నిలిచిన మహబూబాబాద్ జట్లకు అతిథులు ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు ఉపేందర్, రాము, మట్టెడ కుమార్, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజేతలతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అతిథులు

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో నిర్వహించిన అండర్-15 విభాగం పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదరంగం పోటీలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. విజేతలు నవంబరు 3 నుంచి 11 వరకు తమిళనాడులో జరిగే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. చీఫ్ ఆర్బిటర్ సాయిప్రసాద్, ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.

విజేతలు: బాలుర విభాగంలో యోహాన్ యాదవ్, ప్రణయ్, అంజనికుమార్, సాహర్ష, బాలికల విభాగంలో యాశ్విజైన్, శరణ్య, సహర్ష, శ్రీలాస్య తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు.

మూసీ పునరుద్ధరణలో నిర్వాసితులకు న్యాయం చేయాలి



రహదారి పనులు పరిశీలిస్తున్న సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, నాయకులు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మూసీ నది పునరుద్ధరణ, హైడ్రాలో ఇళ్లు కోల్పోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పార్టీ సమావేశానికి హాజరై ఖమ్మం వెళ్తూ.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఎల్కతుర్తి - సిద్దిపేట జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి పనులు నాసిరకంగా సాగుతున్నాయని, దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆచార్య సాయిబాబు మృతి కేంద్ర ప్రభుత్వ హత్యగా అభివర్ణించారు. ఇటీవల హరియాణాలో జరిగిన ఎన్నికల్లో భాజపాది నిజమైన విజయం కాదని, కాంగ్రెస్ వైఫల్యంతో అధిక సీట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడువులోపు హామీలను అమలు చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత అవసరం



కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేటలో నిర్మిస్తామంటున్న కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కాజీపేట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అయోధ్యపురంలో వ్యాగన్ తయారీ కేంద్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జీఎంతో జరిగే సమావేశంలో ప్రస్తావిస్తానని, తర్వాత రైల్వే శాఖ మంత్రిని కలుస్తానని చెప్పారు. జిల్లా వాసుల చిరకాల స్వప్నం కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధనకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాజీపేట - బల్లార్షా మార్గంలో నాలుగు లైన్ల నిర్మాణం పూర్తికావడంతో కాజీపేట మీదుగా మరిన్ని రైళ్లు తిరిగే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా ప్లాటుఫారాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాజీపేట స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, విశ్రాంత గదుల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాజీపేటలో బస్టాండ్ లేక పోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే స్థలం ఇస్తే బస్టాండ్ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం రైల్వే ఆసుపత్రిని సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఈ లక్ష్మీనారాయణ, సీనియర్ డీఈఎన్ వెంకట్, సీడీఎం అనికేత్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ పాల్గొన్నారు.

ప్రమాదం అల్లుకుంది



మండలంలోని శివునిపల్లి శివారులో ఘన్‌పూర్- పాలకుర్తి రహదారి, కొత్తపల్లి నుంచి మీదికొండకు వెళ్లే రహదారిలో విద్యుత్తు స్తంభాలకు తీగ జాతి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. దీంతో వర్షాలు కురిసే సమయంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు సమస్యను విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

– న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్

దారంతా చెత్తమయం

బచ్చన్నపేట మండల కేంద్రంలోని గడిమైసమ్మ నుంచి బీడికంపెనీకి వెళ్లే రహదారి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అధ్వానంగా దర్శనమిస్తోంది. గ్రామాల్లో ఉన్న ప్రత్యేకాధికారులు నెలకొన్న సమస్యలపై కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఒడ్డెర కాలనీ, మార్కండేయస్వామి ఆలయానికి వెళ్లే రహదారిలోనూ వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వ్యాపిస్తోందని, వ్యర్థాలను తొలగించాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బచ్చన్నపేట



తాగునీటి ట్యాంకుపై పట్టింపేదీ..?



రఘునాథపల్లి మండలం నిడిగొండ ప్రధాన రహదారిలో ఉన్న మినీ తాగు నీటి ట్యాంకు మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారింది. సమీపంలోని ప్రాథమిక పాఠశాల, పశు వైద్యశాల, పాల సేకరణ కేంద్రాలతో పాటు పరిసర గృహాల ప్రజలకు తాగు నీటి సదుపాయాన్ని కల్పించేందుకు దశాబ్దాల కింద దీనిని నిర్మించి, దాహార్తిని తీర్చారు. రానురాను చుట్టూ నిర్మించిన గచ్చు, నల్లాలు పూర్తిగా శిథిలమవడంతో అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రఘునాథపల్లి

శునకాల స్వైర విహారం



మండలంలోని నెల్లుట్ల గ్రామంలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. విద్యార్థులు, మహిళపై దాడి చేసి గాయపర్చాయి. కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని పంచాయతీ కార్యదర్శి రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

– న్యూస్‌టుడే, లింగాలఘనపురం

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



బచ్చన్నపేటలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం బచ్చన్నపేట మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేతతో కలిసి కొమ్మూరి ప్రారంభించారు. అలాగే మండలంలోని కట్కూర్, బండనాగారం, పోచన్నపేట, తతర గ్రామాల్లోనూ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. కార్యక్రమంలో డీసీఎం వినీత, ఏఎంసీ నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు 50 శాతం ఇంటిపన్ను వసూలు



మాట్లాడుతున్న డీపీవో స్వరూప

కొడకండ్ల, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు ఈ నెలాఖరు నాటికి తమ పరిధిలోని పల్లెల్లో 50 శాతం ఇంటిపన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎన్. స్వరూప తెలిపారు. బుధవారం కొడకండ్ల ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రసహాయకులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పల్లెల్లో వ్యాపారం నిర్వహిస్తున్న చిన్న, పెద్ద వ్యాపార సంస్థలకు విధిగా లైసెన్సు అందించాలని, లేని పక్షంలో అధికారుల బృందం పరిశీలించి, సీజ్ చేస్తుందని చెప్పారు. పంచాయతీల నిర్వహణకు విధిగా రిజిస్టర్‌లు వాడాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో శేషాద్రిసూరి, ఏపీవో కుమారస్వామి, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్తు ప్రమాదాల నివారణపై అవగాహన

జనగామ టౌన్, న్యూస్‌టుడే: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ జనగామ సర్కిల్ ఎస్‌ఈ వేణుమాధవ్ సూచించారు. జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో 'విద్యుత్ ప్రమాదాలు-నివారణ' అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన చర్యలపై దృశ్యమాధ్యమం ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌ఈ వేణుమాధవ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అవగాహన కల్పిస్తే అన్ని కుటుంబాల్లో కూడా అవగాహన కల్పించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంవీకేవై ధ్రువపత్రం అందజేత




జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి ఎంపికైన జనగామ పట్టణంలోని 27వ వార్డు లబ్ధిదారులకు ఆ వార్డు కౌన్సిలర్, భాజపా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త పీఎంవీకేవై సర్టిఫికెట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్, నాయకులు వీరలింగం, రవి, ప్రసాద్, శ్రీకాంత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ బియ్యం పట్టివేత

కొడకండ్ల, న్యూస్‌టుడడే: మండలంలోని పలు గ్రామాల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని, వాహనాన్ని బుధవారం అదుపులోకి తీసుకున్నామని ఎస్సై రాజు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన భానోత్ మోహన్(24) రాయితీ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయిస్తున్నాడన్నారు. ఈ క్రమంలో కొడకండ్లలో ఓ గది అద్దెకు తీసుకొని దందా చేస్తుండగా, బుధవారం 8 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్రమశిక్షణ.. లాఠీ తప్పుతోంది!

తాజాగా ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్‌పై కాజీపేట ఠాణాలో పోక్సో కేసు నమోదు కావడం సంచలనం సృష్టించింది.



స్నేహపూర్వక పోలీస్ వ్యవస్థ అని చెబుతూ కొందరు పోలీసులు గాడి తప్పి వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన చోట కొంతమంది హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. వీరితో మొత్తం పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తోంది. అవినీతి, అక్రమ వసూళ్ల నుంచి మహిళలు, చిన్నారులపై అత్యాచారాల వరకు అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఠాణాల్లో పోలీసు అధికారులపైనే కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.

– న్యూస్‌టుడే, వరంగల్‌క్రైం

ఫిర్యాదు చేసేందుకు భయం

పోలీసుశాఖలో వరుస ఘటనలు వెలుగు చూస్తుండటంతో సామాన్యులు ఠాణాలకు వచ్చి ఫిర్యాదులు చేసేందుకు భయపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

అక్రమ కేసులు, ఇతర వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న పోలీసు అధికారులపై తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నా కొద్ది రోజుల తర్వాత రాజకీయ నాయకుల అండదండలతో బయటకు వస్తున్నారు. వారి సిఫార్సు లేఖలతో కీలకమైన విభాగాల్లో పోస్టింగ్‌లు పొందుతున్నారు. తర్వాత కేసు విచారణ సమయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆరోపణలను రద్దు చేయించుకుంటున్నారు.

రాజకీయ జోక్యం తగ్గాలి

పోలీసు శాఖ పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం తగ్గితే చాలా వరకు మార్పులు వస్తాయి. ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇస్తే కొంత వరకు ప్రజలకు మేలు జరుగుతుంది.

ఈ ఏడాది వరుస ఘటనలు..

- కేయూ ఠాణాలో పనిచేసిన ఎస్సై అనిల్ మరో ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని వేధించాడు. మహిళ భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న సీఐ సంపత్ కేయూ ఠాణా పరిధిలో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కూతురుపైనా అత్యాచారం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- పోలీసు శాఖలోని ఇతర విభాగంలో పనిచేస్తున్న సీఐ చింతక్రిష్ణ సమీపంలోని అతిథి గృహంలో మహిళతో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లేసరికే మహిళను తప్పించాడు. అనంతరం పోలీసులు దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.
- గత ఏడాది పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ మహిళ ఎస్సైతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అధికారులు ఇన్‌స్పెక్టర్, ఎస్సై ఇద్దరిని సస్పెండ్ చేశారు.

బ్యాంకుల వద్ద పోలీసు భద్రత



స్టేషన్‌ఘన్‌పూర్ శివునిపల్లి బ్యాంకు వద్ద

ఈనాడు కథనానికి స్పందన

జనగామ టౌన్, న్యూస్‌టుడే: బ్యాంకుల్లో నగదు విడుదల చేసుకుంటున్న క్రమంలో కొందరు ఖాతాదారుల నంచి అగంతక ముఠా ఇటీవల జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నగదు కాజేస్తున్నారు. ఈ అంశంపై 'బ్యాంకుల వద్ద దొంగలున్నారు జాగ్రత్త' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. జనగామ జిల్లా కేంద్రంతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలోని పలు బ్యాంకుల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తొర్రూరు: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం ఉదయం పట్టుకున్నట్లు ఆరై బషీర్ తెలిపారు. యథేచ్ఛగా రవాణాకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టగా, ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులకు అప్పగించి, కేసు నమోదు చేయించామని వివరించారు. అనుమతులు లేకుండా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'బుర్రా వెంకటేశం'ను ఆదర్శంగా తీసుకోవాలి



ఏబీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులతో జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ ప్రాంతానికి చెందిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 'బుర్రా వెంకటేశం'ను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని జాయింట్ డైరెక్టర్, కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ డా.డి.ఎస్.ఆర్. రాజేందర్‌సింగ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి, మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని, అందివస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏబీవీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా రావడం ఈ ప్రాంత విద్యార్థులకు వరమని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.ఏ.నర్సయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యార్డులో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, కమిటీ ప్రతినిధులు..

జనగామ, న్యూస్‌టుడే: జనగామ వ్యవసాయ మార్కెట్‌యార్డులో మద్దతు ధరతో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పత్తియార్డు ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, వైస్‌ఛైర్మన్ కొల్లూరి నర్సింలు కలిసి ప్రారంభించారు. ప్రతి గింజ మద్దతు ధరతో విక్రయించుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఛైర్మన్ కోరారు. కార్యక్రమంలో డీఎంవో నరేందర్, కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లారెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షుడు సీహెచ్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని రైతులకే అవకాశం:

- జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఇతర జిల్లాల ధాన్యం విక్రయాల సందర్భంగా నగదు చెల్లింపులు, ఇతర ఇబ్బందులు తలెత్తాయి. ఈ సమస్యలను డీఎంవో నరేందర్ దృష్టికి తీసుకువెళ్లగా, జనగామ జిల్లా పరిధిలోని రైతులకు మాత్రమే యార్డులోని ఐకేపీ కేంద్రంలో విక్రయించేందుకు అనుమతి ఉంటుందన్నారు.

దీపావళికి కాజీపేట మీదుగా ప్రత్యేక రైళ్లు

కాజీపేట, న్యూస్‌టుడే: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కాజీపేట మీదుగా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. 07003 నంబరుతో సికింద్రాబాదు-పాట్నా మధ్య ఈ నెల 26, వచ్చే నెల 2, 9వ తేదీలో ఉంటుంది. సికింద్రాబాదులో ఉదయం 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు పాట్నా చేరుతుంది. 07004 నంబరుతో తిరుగు ప్రయాణంలో పాట్నాలో ఈ నెల 28న, వచ్చే నెల 4, 11వ తేదీల్లో అందుబాటులో ఉంటుంది. మౌలాలి-ముజఫరాపూర్ మధ్య 07649 నంబరుతో ఈ నెల 28, వచ్చే నెల 4, 11 వతేదీలలో ఉంటుంది. మౌలాలిలో సాయంత్రం సోమవారం 4.45 గంటలకు బయలుదేరి, బుధవారం ఉదయం 2.30 గంటలకు ముజాఫర్‌పుర్ చేరుతుంది. 07650 నంబరుతో తిరుగు ప్రయాణం ఈ నెల 30, వచ్చే నెల 6, 13వ తేదీలలో అందుబాటులో ఉంటుంది. ముజాఫర్‌పూర్‌లో బుధవారం ఉదయం 4.50 గంటలకు బయలుదేరి గురువారం సాయంత్రం 7 గంటలకు లింగంపల్లి (తిరుగు ప్రయాణం లింగంపల్లి వరకు) చేరుతుంది. సనత్‌నగర్ నుంచి శంత్రాగాచీకి 07069 నంబరుతో ఈ నెల 30న, వచ్చే నెల 6వ తేదీలలో ఉంటుంది. సనత్‌నగర్‌లో బుధవారం ఉదయం 6.20 గంటలకు బయలుదేరి, గురువారం మధ్యాహ్నం 12.20 గంటలకు శంత్రాగాచి చేరుతుంది. తిరుగు ప్రయాణం 07070 నంబరుతో ఈ నెల 31, వచ్చే నెల 7వ తేదీలలో అందుబాటులో ఉంటుంది. శంత్రాగాచీలో సాయంత్రం గురువారం 5.25 గంటలకు బయలుదేరి, శుక్రవారం రాత్రి 11.50 గంటలకు సనత్‌నగర్ చేరుతుంది.

- పాట్నా ప్రత్యేక రైలు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల సిర్‌పూర్‌కాగజ్‌నగర్‌లలో ఆగుతుంది. ముజాఫర్‌పూర్ ప్రత్యేక రైలు చర్లపల్లి, జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిర్‌పూర్‌కాగజ్‌నగర్‌లలో ఆగుతుంది.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



పవన్‌కుమార్

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి నూతన ఎస్సైగా పవన్‌కుమార్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..శాంతి భద్రతలు పరిరక్షించేందుకు కృషి చేస్తానని, అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలుంటాయని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను సిబ్బంది, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సైల బదిలీలు: **వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని వివిధ ఠాణాల్లో పనిచేస్తున్న ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఠాణా ఎస్సైలు ఎ.ప్రవీణ్‌కుమార్, ఎం.రాజేందర్, తరిగొప్పుల ఠాణా ఎస్సై ఎ.శ్వేతను కమిషనరేట్‌లోని సీసీఆర్‌బీకి బదిలీ చేశారు.

విద్యుత్తు శాఖ అధికారుల..: **జనగామ టౌన్, న్యూస్‌టుడే:** ఎన్పీడీసీఎల్ టౌన్-2 ఏఈ శంకర్ స్టేషన్‌ఘన్‌పూర్‌కు బదిలీ కాగా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి వచ్చిన పులి చంద్రమోహన్ ఏఈగా బాధ్యతలు తీసుకున్నారు. టౌన్-1 ఏఈ మధు బదిలీపై జనగామ రూరల్‌కు వెళ్లగా ఎస్‌ఈ కార్యాలయంలో పని చేస్తున్న సౌమ్య టౌన్-2 ఏఈగా విధుల్లో చేరారు.

మహాసభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఉదయ్

రఘునాథపల్లి: ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుండానే మోసపూరితంగా ఉద్యోగాలను భర్తీ చేయడం సరి కాదని మాదిగ విద్యార్థి ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు గంధమల్ల ఉదయ్‌కిరణ్ అన్నారు. రఘునాథపల్లిలో బుధవారం నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కుట్రను భగ్నం చేసేందుకు ఈ నెల 24న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సును మాదిగ విద్యార్థులు జయప్రదం చేయాలన్నారు. మండల ప్రతినిధులు సింగపురం అఖిల్, నవీన్, కళ్లెపు నవీన్, గొల్లూరి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చిల్పూర్: ఈ నెల 26న వరంగల్‌లో జరగనున్న మాదిగల ధర్మ యుద్ధ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జి అరూరి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. మల్కాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నలిమేల నాగరాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య కవచాల అందజేత

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: కోమాళ్లకు చెందిన గీత కార్మికులకు బుధవారం కాటమయ్య కవచాలను అందజేశారు. గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పెద్దగోని మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యాలయ అధికారి రావుల కిషన్ వీటిని పంపిణీ చేశారు. ఆ సంఘం నాయకులు బండి వేణు, పెద్దగోని రమేశ్, బండి సతీశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన పాలకొండ వెంకటేశ్వర్లు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. ఘన్‌పూర్, చిల్పూర్ మండలాలకు చెందిన ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాలకు చెందిన వైద్యులు బుధవారం బాధిత కుటంబాన్ని పరామర్శించారు. రూ.33 వేల ఆర్థికసాయం అందజేశారు. గట్టయ్య, కుమారస్వామి, చంద్రమౌళి, సుధాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రవచనాలు చెబుతున్న బాల బ్రహ్మానంద సరస్వతి

చిల్పూర్: చిల్పూరులోని బుగులు వేంకటేశ్వర స్వామిని బుధవారం నైమిశారణ్య హిందూధార్మిక సేవా సమితి పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మోహన్, అర్చకులు రవీందర్‌శర్మ, శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

శ్రీరామలీల ప్రవచనాలు



స్వామీజీని సత్కరిస్తున్న ఈవో, సిబ్బంది

లింగాలఘనపురం: నవాబుపేటలోని కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామలీల ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. పరమ పూజ్య బ్రహ్మానంద సరస్వతి, నైమిశారణ్య స్వామీజీలు ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ఈవో వంశీ, సిబ్బంది రాజేందర్‌రెడ్డి, రవితేజ, ఎల్లగౌడ్, అశోక్, రమేశ, వసంత, ఆలయ అర్చకులు లక్ష్మీనర్సింహాచార్యులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కొమురయ్య

లింగాలఘనపురం: లింగాలఘనపురంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం జనగామ ఆర్డీవో కొమురయ్య సందర్శించారు. పరిష్కరించిన, పెండింగ్‌లో ఉన్న ధరణి దస్త్రాలను పరిశీలించారు. దేవాదుల కాల్వ భూసేకరణ పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. తహసీల్దార్ పోతిరెడ్డి రవీందర్, ఆర్ఐలు భగత్‌రెడ్డి, కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా లింగస్వామి

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్, జఫర్‌గఢ్‌లకు చెందిన ఇద్దరికి భాజపా ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు కొరుకొప్పుల నాగేశ్ తెలిపారు. జఫర్‌గఢ్‌కు చెందిన గడ్డం లింగస్వామిని ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా, కూనూర్‌కు చెందిన ఇల్లందుల సారయ్యను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు వెల్లడించారు. వారిని బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అభినందించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నర్సింహులపేట మండలం బాసుతండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం నెల్లికుదురు మండలం కాస్యతండా పంచాయతీకి చెందిన శిరీషకు మండలంలోని బాసుతండాకు చెందిన గుగులోతు వెంక్యాతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారైలు. అదనపు కట్నం కోసం తరుచూ వెంక్యా ఇబ్బందులు పెట్టేవాడు. ఈ నెల 12న వేధించడంతో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నాకి పాల్పడింది. స్థానికులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శిరీష తండ్రి బానోతు వెంకన్న బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు.

నిర్లక్ష్య ధోరణి సరికాదు

దేవరుప్పుల రూరల్: మహిళల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ డి.సుమ తెలిపారు. దేవరుప్పులలో బుధవారం నిర్వహించిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. మహిళల రక్షణకు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు కీర్తన, మానస, ధన్వంతి, తదితరులున్నారు.

IN THE COURT OF Ist ADDL. CIVIL JUDGE AND JMFC-II at BIDAR

O.S. NO. 67 / 2020.

MOTIBAI, W/o. Rekusingh and Others ...Plaintiffs

//VERSUS//

Reku Singh and Others ...Defendants

SUB: Joint Declaration of Ownership and perpetual injuction etc

Notice to Defendant No. 2:

D2: K. RAJNARSIMHAREDDY, S/o. K.V. Venkatarajreddy, Age about 74 Years, Occu: Nil, R/o. Challagariga, Revenue Mandal, Chityal, Warangal District-TS.

Whereas, the Plaintiffs, Have filed the suit for joint declaration of ownership with respect to the suit land. The above matter is fixed on No. **19/11/24** for your appearance at about **11.00am.** Therefore you are required to appear before this Honble to answer the claim of the plaintiffs by personally or through Advocate, On the above Said Date and Time. Otherwise the above matter will be determined in your absence ex-parte.

Hence this notice is issued under my Seal and Signature on this the **4th day of 10/2024** at Bidar.

By the order of the court

Sd/- **CHIEF MINISTERIAL OFFICER**

I.Addl. Civil Judge and JMFC Bidar